ప్రయాణానికి మహాపాట్లు

- మహానాడుకు బస్సులు పంపడంతో అవస్థలు పడ్డ ప్రయాణికులు
- గంటల తరబడి వేచివున్నా ఒక్క బస్సు రాక తిప్పలు
- అధికార పార్టీ నాయకులు, అధికారుల తీరుపై ప్రజల మండిపాటు
- గమ్యస్థానాలకు చేరేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించిన ప్రజలు


బస్సులు లేక బోసిపోయిన రాయచోటి బస్టాండు

రాయచోటి జగదాంబ సెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లే క్రమంలో బస్సులు లేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లాలో జరిగిన మహానాడుకు రాయచోటి డిపోలోని బస్సులను తరలించడం విశేషం. పార్టీ మీటింగ్‌కు ఇలా ప్రభుత్వ బస్సులను హయ్యర్ బస్సులతో సహా తరలించడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే బస్టాండులో గంటల కొలదీ వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో చిన్నా పెద్దా తేడా లేకుండా ఆకలిదప్పులు ఎదుర్కొంటూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వచ్చిన ఒక బస్సులో స్థలం సరిపోక ప్రయాణికులు నరకయాతన పడ్డారు. బెంగళూరు వెళ్లాన్నా, కడప, హైదరాబాద్, తిరుపతి, మదనపల్లి, కదిరి, కర్నూలు, వేంపల్లి ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయాణికులకు నరకం కనపడింది. ఎప్పుడూ కొన్ని బస్సులను మాత్రమే ఇలా పార్టీ కార్యక్రమాలకు తరలించేవారు. కానీ రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గమైన రాయచోటి నుంచి మహానాడుకు హయ్యర్ బస్సులతో సహా బస్సులు తరలించడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సి రావడంతో దీనిపై ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.


బస్సులోకి ఎక్కేందుకు తోసుకుంటున్న ప్రయాణికులు


ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

కోడూరులోనూ తప్పని తిప్పలు

రైల్వేకోడూరు అర్బన్ : కడపలో జరుగుతున్న మహానాడుకు ఆర్టీసీ బస్సులు కేటాయించడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైల్వేకోడూరు నుంచి తిరుపతికి ఆసుపత్రి, విద్యా సంస్థలకు ప్రతినిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. రైల్వేకోడూరు బస్టాండ్‌లో బస్సులు రాకపోవడంతో పలువురు వెనుదిరిగారు. అలాగే ఇబ్బందులు పడి వెళ్లిన ప్రయాణికులు తిరుపతి నుంచి రావడానికి గంటల కొద్ది అక్కడే పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజా ప్రతినిధుల తీరుపై పలువురు ప్రయాణికులు పెదవి విరిచారు.

ప్రత్యామ్నాయం చూపించి ఉంటే బాగుండేది



తాను తిరుపతిలో విధులు నిర్వర్తిస్తున్నాను. ఉద్యోగ నిమిత్తం ఉదయం 9 గంటలకు వచ్చా. కానీ రాయచోటి బస్టాండులో బస్సులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నా. ఏదో ఒకటి ప్రత్యామ్నాయం చూపించి సహకరిస్తే మేము విధులకు వెళ్లేందుకు ఆస్కారం ఉండేది. డ్యూటీకి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది.

– గణేష్, బాలతిమ్మయ్యగారిపల్లె, చక్రాయపేట మండలం

ఒంటి గంటకు వచ్చా



మదనపల్లెకు వెళ్లేందుకు రాయచోటి బస్టాండుకు గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చా. కానీ ఒక్క బస్సు కూడా రాలేదు. సమాచార కేంద్రంలో అడిగితే బస్సులు వస్తాయి. కొంతసేపు వేచిచూడాలని చెబుతున్నారు. గంటలు తరబడి వేచివుంటున్నా వెళ్లాల్సిన రాకపోవడంతో అవస్థలు పడుతున్నాం.

– వెంకటరమణ, హసనాపురం గ్రామం, రామాపురం మండలం

బస్సులు లేక ఇబ్బందులు



రాయచోటి నుంచి మదనపల్లెకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చా, ఇక్కడ బస్సులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. మహానాడు వంటి పార్టీ మీటింగ్ పెట్టేందుకు వేలాది బస్సులు సొంత అవసరాలకు పెట్టుకోవడం చాలా బాధాకరం. ప్రజల విధానాలు తెలుసుకుని బస్సులు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

– ప్రభాకర్, మదనపల్లె, ప్రయాణికుడు

ట్రాఫిక్‌కు అంతరాయం


ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు : కడప పట్టణంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి అధిక సంఖ్యలో వెళ్తున్న వాహనాల వల్ల స్థానిక బస్టాండు కూడలిలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మహానాడుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో పలుమార్లు ఏర్పడిన ట్రాఫిక్‌ను ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో పునరుద్ధరించారు. ఉదయం 11 గంటల నుంచి దాదాపు మధ్యాహ్నం 2 గంటల వరకు వాహనాలు నిలిచిపోయాయి.

1న హామీల అమలు కోసం ధర్నా

బి.కొత్తకోట : అధికారంలోకి వచ్చేందుకు కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 1వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పీటీఎం రోడ్డు వద్ద ధర్నా కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల మంజూరు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలన్న డిమాండ్‌తో ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అష్రఫ్ వల్లీ, తంబయ్యశెట్టి, వెంకటరమణ, బావాజాన్, నరసింహులు, నారాయణస్వామి, హబీబ్, షఫీ, బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

31న జాబ్ మేళా

రాయచోటి టౌన్ : ఈ నెల 31వ తేదీ అన్నమయ్య జిల్లా కేంద్రంలోని మొలకలచెరువులోని బ్లాసమ్ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారితో పాటు ఐటీఐ డిప్లమా పూర్తి చేసిన 18 – 30 సంవత్సరాల యువతీయువకులు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మేళాలో ఎంపికైన వారికి వేతనం రూ.16 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుందన్నారు.

క్రిస్టియన్ ఆస్తులను రిజిస్టర్ చేయవద్దు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని క్రిస్టియన్ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయరాదని పుల్లంపేట రిజిస్టర్ మహ్మద్ రఫీకి రైల్వేకోడూరు లూథరన్ చర్చి నిర్వాహకులు భాను ప్రకాష్, ప్రభాకర్, సాల్మాన్, భాస్కర్‌లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని అమ్ముకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అందువల్ల చర్చి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయరాదని వారు విన్నవించారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు పాల్గొన్నారు.

పేట గంగమ్మకు ఆకేపాటి మొక్కులు


నాయకులతో కలిసి గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేట గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. మండల పరిధిలోని కొండ్లోపల్లిలో గురువారం పేట గంగమ్మకు ఆ గ్రామ ప్రజలు ఘనంగా జాతర కార్యక్రమం నిర్వహించారు. జాతరలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలలో ఊటుకూరు ఎంపీటీసీ నాగా శేఖర్‌రెడ్డి, గ్రామ స్థాయి నాయకులు క్రిష్ణయ్య, రామయ్య, సుబ్బరాయుడుతో పాటు వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

రీసోర్స్ పర్సన్‌లకు యోగా శిక్షణ


యోగా శిక్షణలో పాల్గొన్న మాస్టర్లు

రాయచోటి టౌన్ : డివిజన్ స్థాయిలోని యోగా మాస్టర్లకు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా డివిజన్ స్థాయి మండలానికి ఒకరు చొప్పున శిక్షకులకు (మాస్టర్లు) రాయచోటి బాలికోన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మాస్టర్లుగా రమేష్ బాబు, వాణిశ్రీలు వ్యవహరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణలో రాయచోటి, చిన్నమండెం, గాలివీడు, గుర్రంకొండ, కలకడ, కేవీపల్లె, లక్కిరెడ్డిపల్లె, పీలేరు, రామాపురం, సంబేపల్లె, వీరబల్లె, సుండుపల్లెకు చెందిన శిక్షకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎల్లమ్మ జాతర


అలంకరణలో ఎల్లమ్మ తల్లి

వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల పెద్దూరులో కొలువై భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ ఎల్లమ్మ తల్లి జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వంగిమళ్ల దిగువరాచపల్లి గ్రామాలలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాల మధ్య ఎంతో వైభవంగా ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గిరిజన సామాజిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని గిరిజన ఐక్య వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సొరకాయల శివశంకర్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కడపకు వచ్చిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ, తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొంది ఉద్యోగాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు


శ్రీ వరదరాజస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలిలోని పురాతన శ్రీ వరదరాజు స్వామి, శ్రీ వీరభద్రస్వామి ఆలయాలను గురువారం దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, రాజంపేట సమూహ దేవాలయాల అధికారి కొండారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్యలు సందర్శించారు. వరదరాజ స్వామి ఆలయానికి సంబంధించి సర్వే నెంబరు. 383లో 83 సెంట్లు ఖాళీ స్థలాన్ని, అలాగే శ్రీ భద్రకాళి శ్రీ వీరభద్రుడు స్వామి వారి ఆలయాలలోని సర్వే నెంబరు. 165లో 2.28 ఎకరాల భూమిలో ఉన్న 60 మామిడి చెట్లను సందర్శించారు. సదరు మామిడి చెట్లకు సంబంధించి ఫలసాయాన్ని గుత్తకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సర్వేయర్‌ను కలిసి భూములకు సంబంధించి హద్దులు గుర్తించామని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి, ఆలయ అర్చకులు అరవింద స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటకరంగం ఎంతో గొప్పది


కళాకారుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్ : నాటకరంగం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జీఎంసీ కళామందిర్‌లో బుధవారం రాత్రి ప్రముఖ కళాకారులుగా రాణించిన దివంగత వేంపల్లె బాషా, మూలపల్లె రామయ్య, చంద్ర ఓబులపతి, పల్లేటి లక్ష్మీకులశేఖర్, వెంకట నరసరాజు జ్ఞాపకార్థంగా శ్రీ అన్నమాచార్య, మణికంఠ కళాకారుల ఐక్య వేదిక బృందం ఆధ్వర్యంలో ఉచిత పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సెల్‌ఫోన్ విప్లవంలో నాటకరంగం అంతరించిపోతున్న తరుణంలో రాజంపేటకు చెందిన అనేక మంది కళాకారులు నాటకరంగాన్ని బతికించుకునేందుకు కృషి చేస్తుండటం అభినందనీయమని తెలిపారు. ఒకప్పుడు ప్రజలను చైతన్యపరిచేందుకు నాటకరంగమే వేదికగా ఉండేదన్నారు. నాటకరంగం పేరు వింటే ఈ ప్రాంతంలోని పాతతరం ప్రజలకు కమ్మూసాహెబ్ గుర్తు కొస్తారన్నారు. ఒకప్పుడు సమాజంలో కుల వివక్షతో పాటు పేదలు, ధనవంతులు అన్న తేడా బాగా ఉండేదన్నారు. అయితే మనుషులంతా ఒక్కటే అని కమ్మూసాహెబ్, వారి సోదరులు ఊరూరా నాటకాలను ప్రదర్శించడమే కాక బుర్రకథలతో ప్రజలను చైతన్య పరిచేవారన్నారు. కమ్మూసాహెబ్ హయాం నుంచి కూడా అనేక మంది కళాకారులు నాటకరంగంలో రాణిస్తూ తమ ప్రతిభ చాటుతున్నారన్నారు. ఇప్పటికీ జబ్బిరెడ్డి వెంకటరెడ్డి లాంటి కళాకారులు నాటకరంగాన్ని బతికించేందుకు తమ శక్తికిమించి కృషి చేస్తున్నట్లు చెప్పారు. నాటకరంగం అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు ఎప్పుడు ఉంటాయని పేర్కొన్నారు. కాగా తొలుత మృతి చెందిన కళాకారుల ఆత్మశాంతి కోసం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డితో పాటు కళాకారులు, ప్రేక్షకులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగా శేఖర్‌రెడ్డి, ప్రముఖ కళాకారులు గుండ్లూరు సుబ్బరాయుడు, సంద్రపల్లి కృష్ణయ్య, బి.పెద్దరెడ్డయ్య, యు.రామచంద్రారెడ్డి, వి.సుబ్బరాజు, రమణశ్రీ, మారోతు గంగయ్యనాయుడు, విజయలక్ష్మి, రవీంద్రనాయుడు, జయరామిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర


గంగమ్మను దర్శించుకుంటున్న కొరముట్ల, కొండూరు అజయ్‌రెడ్డి తదితరులు

పెనగలూరు : మండలంలోని నల్లపురెడ్డిపల్లి పంచాయతీలో గురువారం జరిగిన గంగమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జాతరలో రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వర్షాలు సమృద్ధిగా పడి పంటలు పండాలని గంగమ్మను కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బండి సానారెడ్డి, లేబాకు వెంకటరెడ్డి, కామసూరు వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగసుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా అంతకుముందు గ్రామస్తుల ఆహ్వానం మేరకు జాతరలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి గంగమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆకేపాటిని ఘనంగా స్వాగతించారు.

ఎల్లమ్మకు పుట్టింటి పట్టుచీర సమర్పణ



ఎల్లమ్మకు పట్టుచీరను తీసుకువస్తున్న గానేని కుటుంబ సభ్యులు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులోని ఎల్లమ్మతల్లికి పుట్టింటి ట్టుచీరను గానేని సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు గురువారం సమర్పించారు. ఆదివారం జాతర జరుగనుండగా రెండురోజుల ముందే పుట్టింటి పట్టుచీరను ఎల్లమ్మకు ఇవ్వడం ఆనవాయితీ. గత పదమూడు సంవత్సరాలుగా పసుపు, కుంకుమ, పూలు, పండ్లను గానేని కుటుంబ సభ్యులు సమర్పిస్తూ వస్తున్నారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సర్టిఫికెట్ పోయిందని ఫిర్యాదు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎం.హరి తన పదో తరగతి మార్కులిస్టు, టీసీ పోయాయని గురువారం రైల్వేకోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరికైనా దొరికితే తప్పనిసరిగా తనకు ఇవ్వాలని విద్యార్థి వేడుకుంటున్నాడు.

జూన్ 5 నుంచి అంకాలమ్మ తిరునాల



సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో జూన్ 5వ తేదీ గురువారం నుంచి అంకాలమ్మ తిరునాల జరుగునని గ్రామ పెద్దలు తెలిపారు. ఈనెల 5వ తేదీ అంకాలమ్మకు చల్లపోయడం, కుంకుమార్చన, అంకాలమ్మ కథ, అంకాలమ్మ, పోతులరాజు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు జరుగునన్నారు. 6వ తేదీన అంకాలమ్మ బియ్యపు కొలత, అంకాలమ్మ కథ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 7వ తేదీన అమ్మవారికి కపిర తీయుట, సాయంత్రం జల్దిలో అంకాలమ్మ ముగ్గువేసి రాజులను రతనాలను చేసి కొలువు అందించుట 8న ఉదయం జల్ది నుంచి అంకాలమ్మ ఊరేగింపు కార్యక్రమం జరుగునన్నారు. భక్తులు అమ్మవారికి కాయాకర్పూలు సమర్పించి భక్తులు మొక్కుబడులు చెల్లించుట, ఉదయం 10 గంటలకు సిద్దయాగం, తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం అమమ్మవారి గుడిచుట్టూ సుడిబండ్లు, బోనాల సమర్పణ వంటి పూజలు జరుగునన్నారు. సాయంత్రం వృషభ రాజములచే బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన యడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ. 50వేలు దాత రాజంపేట జనసేన నాయకుడు అతికారి క్రిష్ణ, రెండవ బహుమతి రూ. 30వేలు దాత టీడీపీ నాయకుడు కుప్పాల వెంకటసుబ్బయ్య, మూడవ బహుమతి రూ. 20వేలు చలపాటి చంద్ర, నాల్గవ బహుమతి రూ. 10వేలు దేరంగుల శ్రీకాంత్‌లు అందజేస్తారన్నారు.

మహానాడుకు రాకుంటే పథకాలు రావు


టీడీపీ కార్యాలయం వద్ద నాయకులతో మాట్లాడి వెళుతున్న వెలుగు సీసీలు

రైల్వేకోడూరు అర్బన్ : కడపలోజరుగుతున్నమహానాడు చివరి రోజు సభకు గురువారం రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రుపానందరెడ్డి హుకూంతో స్థానిక వెలుగు అధికారులు జీహుజూర్ అన్నట్లు కోడూరు, ఓబులవారిపల్లిలో స్థానిక వెలుగు సీసీలు స్వయంగా డ్వాక్రా మహిళలను తరలించే ఏర్పాట్లు చేశారు. రెండు రోజులు వెలుగు అధికారులు కార్యాచరణ రూపొందించి అన్ని గ్రూపుల లీడర్లతో మాట్లాడి బస్సులలో మహిళలను సభకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. స్వయంగా రాఘవరాజపురంలోని టీడీపీ కార్యాలయం వద్ద జన సమీకరణలో పాల్గొన్న నాయకులతో వెలుగు అధికారులు ముచ్చటించారు. దీని విషయమై ఏపీఎం వసుంధరను వివరణ కోరడానికి ఫోన్ చేయగా స్పందించకపోవడం గమనార్హం. గ్రామాలలో ప్రజలను మహానాడుకు రాకుంటే పథకాలు రావంటూ కొందరు అధికారులు బలవంతంగా సభకు హాజరయ్యేలా ప్రయత్నం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

భక్తిశ్రద్ధలతో మాతమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో మాతమ్మ


ప్రత్యేక ఆకర్షణగా చాందినీబండి

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దమాదిగపల్లెలో వెలసి ఉన్న మాతమ్మ తల్లి జాతర ఉత్సవాలు గురువారం ఉదయం నుంచేఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ఉదయాన్నే ప్రత్యేక పూజలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గావు పట్టుట, పుట్ట బంగారు తెచ్చి పూజించడంతో పాటు పొంగుబాలు తెచ్చి పొంగొపెట్టడం, సిద్దులకు ఒక పొద్దు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కుబడుల్లో భాగంగా రాత్రి డప్పు వాయిద్యాలు, కోలాటాలు, బాణసంచా కాలుస్తూ రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో ఆలయం చుట్టూ చాందినీబండ్లు ప్రదక్షిణలు చేశాయి.

అంబరమంటిన కొత్తకోడూరు గంగమ్మ జాతర


గంగమ్మకు పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


అమ్మవారిని గ్రామంలో ఊరేగిస్తున్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరులో వెలసివున్న గంగమ్మకు గురువారం నిర్వాహకులు, భక్తులు వైభవంగా జాతర నిర్వహించారు. ప్రజలు, మహిళలు వైభవంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కుబడులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, శివయ్య, ఆంజనేయులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు గంగమ్మకు పొంగుబాలు పొంగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉగ్రవాదాన్ని ప్రతిఘటించి, మతసామరస్యాన్ని కాపాడుదాం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పీలేరు : ఉగ్రవాదాన్ని ప్రతిఘటించి, మతసామరస్యాన్ని కాపాడుదామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటరామయ్య, వెంకటాద్రి అన్నారు. గురువారం పీలేరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కోరుతూ సమైక్యతా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై దాడి అనంతరం ఉగ్రదాడిని ఖండించడంలో దేశ ప్రజలు ప్రదర్శించిన ఐక్యత, సమైక్యతా స్ఫూర్తి ప్రజలందరినీ ఒక్కతాటిపై నిలిపిందని తెలిపారు. అయితే కొందరు నాయకులు మతాలు వేరు చేసి మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు షాకీర్, రియాజ్, మహమ్మదాలి తదితరులు పాల్గొన్నారు.